క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన షాహిద్‌ను అభినందిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని ఐకాన్ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థి షాహిద్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో అండర్ -19 విభాగంలో అథ్లెటిక్స్ 100, 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో పాల్గొన్నాడు. రెండు విభాగాల్లోనూ రెండో స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రతినిధి సురేష్‌కుమార్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు బాబాఖాన్, బైరిశెట్టి తదితరులు షాహిద్‌ను అభినందించారు.

రేపు ఈయూ సర్వసభ్య సమావేశం

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డులో ఉన్న శివాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మడకశిర డిపోకు సంబంధించిన ఈయూ (ఎంప్లాయీస్ యూనియన్) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈయూ డిపో అధ్యక్షుడు రఫిక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఈయూ రాష్ట్ర, జిల్లా, జోనల్ నాయకులైన నబీరసూల్, నాగార్జునరెడ్డి, జీవైపీ రావు, శ్రీనివాసులు, నారాయణస్వామి, ఆదినారాయణ, గంగాద్రి తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు, యూనియన్ అంశాలు, తదితర వాటిని చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని మార్కెట్ వద్ద నిర్మిస్తున్న నూతనంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి రమణ, శీలా, డాక్టర్ నిహాల్ కుటుంబ సభ్యులు రూ.2,02,116 విరాళంగా అందించారు. పట్టణంలో ఎంతో అద్భుతంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి చాలామంది దాతలు ముందుకు రావడం సంతోష కరమని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర , నిమ్మకాయల రాము, అమర్ మనోజ్ పాల్గొన్నారు.

చౌళూరు రామకృష్ణారెడ్డికి ఘన నివాళి



చౌళూరు రామకృష్ణారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మధుమతిరెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, దివంగత చౌళూరు రామకృష్ణారెడ్డి మూడో వర్ధంతిని పురస్కరించుకొని చౌళూరులోని రామకృష్ణారెడ్డి ఘాట్ వద్ద ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆయన సోదరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన సోదరుడు లేని లోటు పూడ్చలేనిదని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అర్హుల గుర్తింపులో పక్షపాతం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులను గుర్తించడంలో పక్షపాతం వద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళీశాఖామంత్రి సవిత అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఆయా మండలాల్లో చేపట్టిన పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్త పనుల అంచనాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, రెవెన్యూ, హౌసింగ్, శానిటేషన్, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యంతో పాటు అత్యవసర సేవలపై యుద్ధ ప్రాతిపదిన స్పందించాలని అధికారులకు సూచించారు.

ఎండకు ఎండుతూ .. వానకు తడుస్తూ

- వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు
- పోలీస్‌స్టేషన్లలో మగ్గుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు



పరిగి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఉంచిన ద్విచక్ర వాహనాలు

పరిగి:నియోజకవర్గంలోని పలు పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడిచి ఆఖరుకి తుప్పుపట్టిపోతున్నాయి. కొన్నేళ్లుగా పోలీస్‌స్టేషన్లలో ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు సంబంధిత యజమానులు విడిపించుకోకపోవడంతో పోలీస్‌స్టేషన్లోనే మగ్గుతున్నాయి. ప్రధానంగా అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడినవే అధికంగా ఉన్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులు సీజ్ చేసినవి ఉన్నాయి.

150కి పైగా వాహనాలు

పెనుకొండ నియోజకవర్గంలో దాదాపు 150కి పైగానే పోలీసులు సీజ్ చేసిన వాహనాలు ఉన్నట్లు తెలిసింది. ఆయా మండలాల పరిధిలో ఉన్న పోలీస్టేషన్లలో అవి తప్పుపట్టిపోతున్నాయి. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను యజమానులు విడిపించుకోకపోవడంతో సంవత్సరాలుగా పోలీస్‌స్టేషన్ల ఆవరణంలో ఉండిపోతున్నాయి. వాహన రిజిస్ట్రేషన్ ఉన్న యజమాని నుంచి ద్విచక్ర వాహనం కొన్న వ్యక్తి పేరుపైకి బదిలీ చేయించుకోని వాహనాలే ఎక్కువగా ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. దీంతో అసలు యజమానికి నోటీసులిచ్చేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు.

తుప్పుపట్టిపోతున్న విడిభాగాలు

సీజ్ చేసిన వాహనాలు చాలా కాలంగా ఉండటంతో ఎండకు ఎండుతూ వానకు తడిచిపోతుండటంతో తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో ఇనుప విడిభాగాలు తుప్పుపట్టి, మిగిలిన పరికరాలు (బ్యాటరీ, టైర్లు, ఇంజన్) పనికి రాకుండా పోతున్నాయి.

రెండేళ్లుగా లేని బహిరంగ వేలం

నిబంధనలను అతిక్రమించిన వాహనాలపై 6 నెలలకోసారి చర్యలు చేపట్టాలి. సీజింగ్ వాహనాలను నిరుపయోగంగా ఉంచకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు బహిరంగవేలం వేయాలి. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుంది. అయితే గత రెండేళ్లుగా పోలీస్‌స్టేషన్లలో వాహనాల వేలం పాట లేకపోవడంతో నియోజకవర్గంలోని పరిగి, సోమందేపల్లి, పెనుకొండ మండలాల్లో వాహనాలు తుప్పుబట్టిపోతున్నాయి. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వాహనాలను విడిపించుకుని వెళ్లాలంటే మార్కెట్ విలువ ఆధారంగా ఎక్సైజ్‌శాఖ విధిస్తున్న క్లెయిమ్ అధికంగా ఉండటంతో రిలీజ్ చేయించుకునేందుకు వాహనదారులు వెనకడుగువేస్తున్నందునే వాహనాల పేరుకుపోతోందని అంటున్నారు.

యజమానుల గుర్తింపుతో ఆలస్యం



సీజ్‌లో ఉన్న వాహనాలపై చర్యలు చేపడుతున్నాం. ఎక్సైజ్‌శాఖ పరిధి మినహా మిగిలిన వాహనాలపై కోర్టు ఆదేశాల మేరకు కేసుల నమోదు, విడుదల కోసం యత్నిస్తున్నాం. కొన్ని వాహనాల విషయంలో కేసు నమోదు సమయంలోనే బాధిత వ్యక్తి పేరుతో కాకుండా కొన్న వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ ఉంటుండటంతో శాఖాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– రంగడుయాదవ్, ఎస్‌ఐ, పరిగి

త్వరలోనే వేలంపాటకు చర్యలు



ఎక్సైజ్‌శాఖ పరిధిలో కేసులు నమోదైన వాహనాల బహిరంగ వేలంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే బహిరంగవేలం నిర్వహణకు చర్యలు చేపడతాం. పట్టుబడిన వాహనం విషయంలో అసలు యజమానికే రెండుసార్లు షోకాజ్ నోటీసులివ్వాల్సి ఉంటుంది. సదరు యజమాని గుర్తింపుకోసం యత్నిస్తున్నాం. వాహనాల బదిలీ అనంతరం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

– లక్ష్మీదుర్గయ్య, సీఐ, ఎక్సైజ్‌శాఖ, హిందూపురం

కష్టపడిన వారికి తగిన గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ పంచాయతీ కమిటీలకు పెద్దపీట వేస్తామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కోడూరు, టేకులోడు పంచాయతీల్లో సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ పంచాయతీ కమిటీలను నియమించారు. దీపిక మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారికి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, అందుకే పంచాయతీ కమిటీలను నియమించి పార్టీ కోసం కష్టపడ్డ వారికి సముచిత గౌరవం ఇచ్చేలా మాజీ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్టీలోకి వచ్చేవారిని వద్దనుకోమని, అయితే అవినీతిపరులను పార్టీలోకి తీసుకోమన్నారు. అదే విధంగా ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చే వారికంటే ఐదేళ్ల పార్టీ జెండా మోసిన వారికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియా బాగా పనిచేయాలని , టీడీపీ చేసే అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. పంచాయతీ కమిటీ ద్వారానే పార్టీ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. నియోజకవర్గంలో 8 వేల మంది వైఎస్సార్‌సీపీ సైన్యం సిద్ధమావుతోందన్నారు. ప్రతి ఒక్కరికీ పార్టీ నుంచి గుర్తింపు కార్డు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి గిరిధర్‌రాజు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కవితారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రామాంజినేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, ఎంపీటీసీలు మంజునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి, ఆదినారాయణ, నారాయణస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలు ఇలా..

కోడూరు కమిటీ అధ్యక్షుడిగా అశ్వర్థరెడ్డి, ఉపాధ్యక్షులుగా అయూబ్, రామచంద్రప్ప, ప్రధాన కార్యదర్శులుగా నాగరాజు, శివనందకుమార్, నాగిరెడ్డి, ప్రసాద్, అశోక్‌రెడ్డి, కార్యదర్శులుగా సూరి, లక్ష్మీపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివారెడ్డి, ఇంతియాజ్, నంజిరెడ్డితో పాటు మెంబర్లను నియమించారు. అలాగే టేకులోడు కమిటీ అధ్యక్షుడిగా శేషాద్రిరెడ్డి , ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా అంజినప్ప, ఆదినారాయణప్ప, అనిల్‌కుమార్, నజీర్, వెంకటేష్, కార్యదర్శులుగా మహేష్, బాలాజీ, థామస్, ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బయపరెడ్డి, వెంకటనారాయణరెడ్డితో పాటు మెంబర్లను ఎంపిక చేశారు.

శిక్షణ తరగతుల పరిశీలన



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

హిందూపురం టౌన్: డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం యూసీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్లు, ఎంఈఓ గంగప్ప, భారత్ విద్యా సొసైటీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. శిక్షణా తరగతులు ఏ విధంగా జరుగుతున్నాయి, సదుపాయాలు, సౌకర్యాల తీరు తెన్నులపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, నాగవేణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గిరి, సీసీ గిరి గ్రామాల్లో ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప ప్రజలకు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. చట్టాలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి హేయం



మడకశిరలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు



గుడిబండ: జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

గుడిబండ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని జంబులబండ గ్రామంలోని మడకశిర – అమరాపురం వెళ్లే జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు పాండరంగమూర్తి మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన రాకేష్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు.

మడకశిర: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం మడకశిరలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. గురువారం కూడా విధులను బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదులు గోవర్ధన్‌రెడ్డి, గోవిందరాజులు, ఉమేష్‌చంద్ర, రాధాకృష్ణ, హనుమంతరాయప్ప, కృష్ణమూర్తి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మెకవాయి వద్ద ఎండిపోతున్న వేరుశనగ పంట



ఎండుతున్న ఆశలు

మడకశిరరూరల్: అప్పులు చేసి సాగు చేసిన వేరుశనగ పంటకు కాయలు కాచ్చే సమయంలో వర్షం పడకపోవడంతో పాటు పంటకు అగ్గి తెగులు సోకడంతో వేరుశనగ పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. నియోజకవర్గంలో జూన్, జూలై మాసాల్లో అప్పులు చేసి రైతులు దాదాపు 18 వేల హెక్టార్లుల్లో వేరుశనగ పంట సాగు చేశారు. అప్పటి నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో పంట ఎండుముఖం పట్టింది. సెప్టెంబర్‌లో పడిన జల్లులు వర్షానికి ప్రాణం పోసుకున్న పంటకు అగ్గి తెగులు సోకి పంట ఎండిపోతుండడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వేరుశనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ రాయాపురంలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంప్లానాయక్ వన్యప్రాణుల సంరక్షణ, ఆవశ్యకత, పర్యావరణ సమతుల్యత తదితర వాటిపై వివరించారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల అందజేశారు. బీట్ ఆఫీసర్ పద్మావతి, సంజీవరాయుడు, మహదేవమ్మ, బీమప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెనుకొండ: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గౌతమి తెలిపారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం వన్యప్రాణుల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయప్ప , అధ్యాపకులు యశోదరాణి, హరీష్ బాబు, రామన్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం

- అనుమతి ఇవ్వాలని అధికారులకు ఎంపీటీసీల వినతి



జెడ్పీ సీఈఓ శివశంకర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

రొళ్ల: స్థానిక ఎంపీపీ హెచ్‌డీ కవిత, వైస్ ఎంపీపీలు డీఎల్ నాగరాజు, జి.రత్నమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని మండలంలోని 8 మంది ఎంపీటీసీ సభ్యులు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం వారు కలెక్టర్ శ్యాంప్రసాద్, ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌తో పాటు స్థానిక ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రికి వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ మండల పరిషత్ గ్రాంట్‌ను ఇతరులకు కేటాయించి తమకు తీవ్ర అన్యాయం చేశారని ఎంపీటీసీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎంపీపీ, వైస్ ఎంపీపీలను పదవుల నుంచి తప్పించి కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకోవాలని అధికారులను విన్నవించారు.

రేపు ఎస్సీ సెల్ జిల్లాస్థాయి సమావేశం

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఎస్సీ సెల్ జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకారావు, హిందూపురం , మడకశిర సమన్వయకర్తలు టీఎన్ దీపిక, ఈరలక్కప్ప, జిల్లాలోని నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మద్యం బార్లకు ఎక్కడ పడితే అక్కడ అనుమతులా?

హిందూపురం: మద్యం విక్రయ దుకాణాలకు బడి గుడి అని తేడా లేకుండా అనుమతులు ఏలా ఇస్తారని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు తహసీల్దార్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. పట్టణంలో సువర్ణ భారతి కళాశాల, గోశాల సమీపంలో నూతనంగా బార్ అండ్ రెస్టారెంట్‌లను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి, పీడీఎస్‌యూ అధ్యక్షుడు బాబావలి, నాయకులు తేజ, గౌరీశంకర్, నాజీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన తిప్పేస్వామి



మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మంగళవారం రాత్రి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, ఆయన తనయుడు డాక్టర్ దినేష్ కలిశారు. ఇటీవలనే తిప్పేస్వామిని పార్టీ హైకమాండ్ సీఈసీ మెంబర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఈసీ సభ్యుడిగా నియమించినందుకు వైఎస్ జగన్‌కు తిప్పేస్వామి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని కూడా కూడా కలిశారు.

పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలోని భువన విజయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లలు పక్కదారి పట్టే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సీడీపీఓ శాంతలక్ష్మీ తెలిపారు. అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు.

గోరంట్ల: అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 10న జరిగే మండల స్థాయి అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి పేర్కొన్నారు.

లక్ష లీటర్ల పాల సేకరణే ధ్యేయం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: తాలూకా వ్యాప్తంగా పాల ఉత్పత్తిదారులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆదుకుంటామని స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు హెచ్‌వీ వెంకటేష్ భరోసా ఇచ్చారు. పట్టణంలోని క్షీర భవనంలో బుధవారం నిర్వహించిన చెక్కుల వితరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి దినం పావగడ డెయిరీల నుంచి లక్ష లీటర్ల పాల సేకరణే ధ్యేయంగా తుముల్ కేంద్రానికి అందించాలని ఎమ్మెల్యే తెలిపారు. ఔత్సాహిక పాడి రైతులకు డీసీసీ బ్యాంకు నుంచి పాడి ఆవుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. తాలూకా లోని నాగలమడక ప్రాంతంలో సుమారు 10 వేల ఎకరాల్లో నిర్మించే రెండో ఫేస్ సోలార్ ప్రాజెక్టును సీఎం సిద్ధరామయ్య డిసెంబర్‌లో ప్రారంభిస్తారన్నారు. అలాగే రూ.25 కోట్లతో పునఃనిర్మించే నాగలమడక దేవాలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు. అనంతరం ఆరోగ్య క్షీర సంజీవిని చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

శుద్ధ కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదనలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని గీతానగర్ సమీపంలో మలజల శుద్ధి కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్ తెలిపారు. బుధవారం స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసులు, ఏఈ మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.